ఈనాడు
ఎన్ఆర్ఐ

# అమెరికాలో ఘనంగా భారత స్వాతంత్ర్య వేడుకలు



డల్లాస్, టెక్సాస్: అమెరికాలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (ఎంజీఎంఎన్‌టీ) ఆధ్వర్యంలో ఆగస్ట్ 15న భారత 70వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. మహాత్ముడికి అతిపెద్ద స్మారకం నిర్మించిన ప్రదేశం ఇర్విన్ నగరంలో ఈ వేడుకలను నిర్వహించారు. మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాలో ఎంజీఎంఎన్‌టీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ షబ్నం మోద్గిల్ అధ్యక్షతన మహాత్ముడికి నివాళులర్పించారు. అహింసా పద్ధతిలో దేశానికి స్వాతంత్ర్య తీసుకొచ్చిన గాంధీజీ జాతిపిత అయ్యారని ఎంజీఎంఎన్‌టీ కార్యదర్శి రావు కాల్వల అన్నారు. మహాత్ముడి మార్గంలో పయనిస్తూ మానవత్వ పరిమళాలను వెదజల్లాలని అభిలషించారు. అక్టోబరు రెండున గాంధీ జయంతి సందర్భంగా ఇదే వేదికపై పీస్ వాక్ నిర్వహిస్తున్నట్లు రావు కాల్వల వివరించారు.



## భారత్‌లో పుట్టడం అదృష్టం

మువ్వన్నెల జాతీయ జెండా, అమెరికా జెండాలను ఎంజీఎంఎన్‌టీ ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ తోటకూర ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్న భారత్‌లో పుట్టడం, అమెరికాలో ఉండటం మన అదృష్టమన్నారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, లాలాలజపత్‌రాయ్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్‌పటేల్, స్వాతంత్ర్య సమరయోధులకు ఘనమైన నివాళులర్పించారు. స్వతంత్ర్య భారతదేశంలోని అవినీతి, ఉగ్రవాదం, మహిళలపై అఘాయిత్యాలు, భ్రూణహత్యలు తదితర వాటిపై పోరాటడానికి ఎన్‌ఆర్‌ఐలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. మహాత్ముడికి ఎంతో ఇష్టమైన రఘుపతి రాఘవ రాజా రాం కీర్తనను ఎంజీఎంఎన్‌టీ బోర్డు డైరెక్టర్ తైయబ్ కుందవాలా ఆలపించారు. స్వాత్రంత్ర్య దినోత్సవం సందర్భంగా డైరెక్టర్ జాక్ గోద్వాని హిందీలో అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలకు సహకరించిన ఇర్విన్ నగర ప్రజలకు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మాధ్యమ ప్రతినిధులకు, సూరజ్ ఆర్ట్స్ ఫొటోగ్రఫీ, ఫన్‌ఏషియా ప్రచారకులకు, డబ్ల్యూఎఫ్‌ఏఏ ఛానల్ 8, టీవీ9, టీవీ5, ఏఐఎన్‌ఏ టీవీ, సరేగమ ఇండియన్ రెస్టారెంట్, వలంటీర్లు తదితరులకు ఎంజీఎంఎన్‌టీ డైరెక్టర్ సల్మాన్ ఫర్షోరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేదికపై 'ప్లాన్ ఏ ట్రీ', ఎంజీఎంఎన్‌టీ సభ్యులు నాలుగు బెంచిలతో కూడిన 'సీటింగ్ ఏరియా'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరువందల మంది ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు.